క్లుప్తంగా

కుమార్తె అదృశ్యంపై తల్లి ఫిర్యాదు

కాశీబుగ్గ: తమ కుమార్తె ఈ నెల పదో తేదీ నుంచి కనిపించడం లేదని పలాస మండలం అల్లుకోల గ్రామానికి చెందిన కొవ్వూరు రోహిణి ఫిర్యాదు చేసినట్టు కాశీబుగ్గ పోలీసులు బుధవారం తెలిపారు. సీఐ మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బూత్ కన్వీనర్ మృతికి సంతాపం

టెక్కలి: టెక్కలి మండలం బూరగాం పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్ పుచ్చకాయల మోహన్‌రెడ్డి(చిట్టి) మృతి చెందగా.. అంత్యక్రియల్లో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఆయన మృతికి సంతాపం తెలియజేశారు. ఎమ్మెల్సీతోపాటు సర్పంచ్ ఎల్.సంజీవరావు, నాయకులు జె.తిరుమలరెడ్డి, జి.జోగారావు,జె.యర్రన్నరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి



జెడ్పీ చైర్‌పర్సన్ విజయకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కవిటి: సుదీర్ఘకాలంపాటు 104 మొబైల్ వాహనాల్లో పనిచేస్తున్న తమకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘ సభ్యులు కోరారు. ఈ మేరకు బల్లిపుట్టుగ గ్రామంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయను బుధవారం కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. తమ న్యాయపరమైన డిమాండ్ల సాధనకు ప్రజాప్రతినిధులంతా సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి



మాట్లాడుతున్న రామ్మోహనరావు

కవిటి: స్వయంశక్తి సంఘాల మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని డీఆర్‌డీఏ క్లస్టర్ ఏరియా కోఆర్డినేటర్ చింతాడ రామ్మోహనరావు అన్నారు. కవిటి మండల మహిళా సమాఖ్యలో ఈ మేరకు కవిటి ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్ దాసరి అశోక్‌తో కలిసి కన్వర్జెన్సీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. స్వయంశక్తి సంఘాలన్నీ ఏ–గ్రేడ్‌లో ఉండేవిధంగా తమ పనితీరును అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఏపీఎం కె.గోవింద్, స్త్రీనిధి మేనేజర్ కె.రాము ఉన్నారు.

నీటి సంఘాల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల



ఇచ్ఛాపురం రూరల్: మండపల్లిలో నోటిఫికేషన్ విడుదల చేస్తున్న ఎంఈవో అప్పారావు

ఇచ్ఛాపురం రూరల్: ఈ నెల 14వ తేదీన జరగనున్న నీటి సంఘాల ఎన్నికల కోసం బుధవారం నోటిఫికేషన్ విడుదలైంది. మండలం, మున్సిపాలిటీ పరిధిలో హరిపురం, శాసనాం, బిర్లంగి, రత్తకన్న, లొద్దపుట్టి, బెల్లుపడ, ఈదుపురం, సన్యాసిపుట్టుగ, బూర్జపాడు, డొంకూరు, ముచ్చింద్ర, ధర్మపురం, పురుషోత్తపురం, కేదారిపురం గ్రామాల్లో ఉన్న 16 నీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయని తహసీల్దార్ ఎస్.వెంకటరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద నోటిఫికేషన్ పత్రాలను అతికించారు. ఎంఈవో కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



యుగంధర్‌కు సాయాన్ని అందిస్తున్న యువజన సంఘం సభ్యులు

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం సరియాబొడ్డపాడు గ్రామానికి చెందిన యువకుడు దురోణంకి యుగంధర్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైద్యం చేయించడానికి అతని కుటుంబ సభ్యులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న టెక్కలికి చెందిన అభయం యువజన సేవాసంఘం సభ్యులు పది వేల రూపాయలను సేకరించారు. ఈ మొత్తాన్ని యుగంధర్‌కు బుధవారం అందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దేవాది శ్రీనివాస్, సభ్యులు శ్రీనివాస్ బెహార, బోయిన నాగరాజు, సాహుకారి రాజేష్, రాజేంద్రప్రసాద్, శంకర్ ఉన్నారు.

సమష్టిగా ఉండాలి

సోంపేట: సమష్టిగా ఉంటేనే అన్ని రంగాల్లో రాణించగలమని శ్రీశయన సంఘ జిల్లా అధ్యక్షుడు లొట్ల దీనబంధు అన్నారు. బెంకిలిలో గ్రామ శ్రీశయన సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన కుల సంఘ భవనాన్ని బుధవారం ప్రారంభించారు. ఒకరికొకరు సహకరించుకోవాలని, పిల్లలను బాగా చదివించాలని సూచించారు. సోంపేట రోటరీ క్లబ్ పూర్వ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు, సంఘ ప్రతినిధులు జి.శంకర్, టి.షణ్ముఖరావు, ఎం.నారాయణ, ఎల్.తారకేశ్వరరావు, టి.తేజ ఉన్నారు.

ధాన్యం..దైన్యం!





ధాన్యాన్ని బస్తాలోకి వేస్తున్న రైతులు

- కానరాని పంట కొనుగోలు
- అయోమంలో అన్నదాత
- రైతు కష్టాన్ని దోచుకుంటున్న దళారులు

వజ్రపుకొత్తూరు రూరల్:

అన్నదాతకు అవస్థలు తప్పడం లేదు. వేలాది రూపాయలు పెట్టుబడిపెట్టి, కష్టపడి పండించిన ధాన్యం కొనుగోలుకు నోచుకోక తమ కళ్ల ముందే దైన్యంగా కనిపిస్తుంటే ఏం చేయాలో తోచక రైతు అయోమయం చెందుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో పలాస నియోజకవర్గం పరిధిలో సుమారు 13,500 ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో పంట దిగుబడి బాగా వచ్చింది. యంత్రాల సాయంతో కోతలు, నూర్పులు చేసి పంట అమ్మకానికి సిద్ధమయ్యారు. గత నెల చివర్లో కురిసిన వర్షాలకు కొంత వరకు పంటకు నష్టం కలిగింది. అయితే మిగిలిన పంటను అమ్ముదామంటే తమకు అవగాహన లేదని, అధికారుల జాడ కూడా కరువై కష్టపడి తాము పండించిన పంట అమ్ముకోలేక దీనస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతు కష్టం దళారుల చేతికి..

రైతుల కష్టాన్ని దళారులు దోచుకుంటున్నారు. ఇటీవల నూర్పులు చేసిన ధాన్యం కొనుగోలుకు నోచుకోకపోవడంతో ధాన్య బస్తాలను పంట పొలంలోనే నిల్వ చేస్తున్నారు. రోజులు గడుస్తున్నా ప్రభుత్వం కొనుగోలు చేయకపోడంతో దిక్కులేక దళారులకు అమ్ముకుంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము దళారుల చేతిలో మోసపోతున్నామని తెలిసినప్పటికీ ఏం చేయాలో తోచక తమ కష్టాన్ని వారి చేతిలో పెడుతున్నామంటున్నారు.

ఆందోళన కలిగిస్తున్న వాతావరణ పరిస్థితులు

ఇటీవల కురిసిన వర్షాలతో రైతు కష్టపడి పండించిన పంట కొంత వరకు నీళ్లపాలైంది. కాగా ప్రస్తుతం రోజు రోజుకూ వాతావరణ పరిస్థితులు మారుతున్నాయి. మరో వైపు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారులు హెచ్చరికలు రైతుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. కష్టపడి పండించిన పంట చేతికి అందుతున్న తరుణంలో వర్షాలు కురిస్తే తాము తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఇలా..

ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొలుగోలు చేయడానికి వజ్రపుకొత్తూరు మండలంలో ఆరు, పలాస మండలంలో 12, మందస మండలంలో 13 కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. వీటిని ఎమ్మెల్యే గౌతు శిరీష ఆర్భాటంగా ప్రారంభించారు. అయితే వీటి ద్వారా ధాన్యం కొనుగోలు అనుకున్న స్థాయిలో జరగడం లేదని రైతులు చెబుతున్నారు.

నాటి పరిస్థితి నేడు లేదు..

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో తాము పండించిన పంటను నేరుగా గ్రామాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాల వద్ద కొనుగోలు చేసే పరిస్థితి ఉండేది. అధికారులు తమకు అవగాహన కల్పిస్తూ పంటను కొనుగోలు చేసే వారని రైతులు చెబుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఈ పరిస్థితి లేక నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి ఇప్పుడు తంటాలు పడాల్సిన పరిస్థితి నెలకుందని వాపోతున్నారు. ఇప్పటికైన ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని కోరుతున్నారు.



ఇటీవల వర్షానికి మొలకెత్తిన ధాన్యం



పెద్దబొడ్డపాడు వద్ద పంట పొలంలో ధాన్యం

వర్షాలకు నష్టపోయాం



ఇటీవల కురిసిన వర్షాలకు కొంతవరకూ పంటను నష్టపోయాం. మళ్లీ వర్షం కురిస్తే చేతికి అందివచ్చిన పంట చేజారిపోయే ప్రమాదం ఉంది. ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన లేదు. గతంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు జరిగాయి. ప్రస్తుతం ఎక్కడ జరుగుతున్నాయో..ఎలా జరుగుతున్నాయో తెలియటం లేదు. అంతా అయోమయంగా ఉంది.

–వై.రాజారావు, రైతు, వజ్రపుకొత్తూరు మండలం

ధాన్యం కొనుగోలు చేయాలి



కష్టపడి పండించిన పంట వర్షాలకు తడిచి నష్టపోతున్నాం. ప్రస్తుతం ధాన్యం కొనుగోలు జరగక పంట పొలంలోనే బస్తాలను నిల్వ ఉంచాం. వారం రోజుల క్రితం కురిసిన వర్షాలకు ధాన్యం తడిసిపోయింది. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు చూస్తుంటే ఆందోళన కలుగుతుంది. అధికారులు స్పందించి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి.

–బి.చంద్రశేఖర్, యువ రైతు, వజ్రపుకొత్తూరు మండలం

అన్నదాతకు అండగా ‘వైఎస్సార్‌సీపీ’ని విజయవంతం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ తదితరులు

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

సోంపేట: ఈ నెల 13వ తేదీన జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తున్న ‘అన్నతదాతకు అండగా వైఎస్సార్‌సీపీ’కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ కోరారు. ఈ మేరకు మండలంలోని మాకన్నపురం గ్రామంలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను పార్టీ నాయకులతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రైతు పెట్టుబడి సాయం ఏడాదికి రూ. 20 వేలు వెంటనే ప్రభుత్వం అందజేయాలన్నారు. ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. 13వ తేదీన చేపట్టనున్న కార్యక్రమానికి రైతులు భారీగా తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నిమ్మన దాస్, కంచిలి జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, పార్టీ నాయకులు ఇప్పిలి కృష్ణారావు, బతకల మోహనరావు, రౌతు విశ్వనాథం, బుద్దాన శ్రీకృష్ణ, కొల్లి ఈశ్వరరావు, మద్దిలి లచ్చయ్య, బతకల సతీష్ పాల్గొన్నారు.

సచివాలయాల సందర్శన



అంపురం సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న తిరుమలరావు

కంచిలి: సచివాలయ సిబ్బంది విధిగా సమయ పాలన పాటించాలని మండలాభివృద్ధి అధికారి వి.తిరుమలరావు అన్నారు. అంపురం, జాడుపూడి సచివాలయాలను బుధవారం సందర్శించి సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించారు. ప్రభుత్వ సర్వేలను సకాలంలో పూర్తిచేయాలని, ఏమాత్రం అశ్రద్ధ చేయకూడదని సిబ్బందికి సూచించారు. జాడుపూడిలో ప్రభుత్వ ఆర్థిక సాయంతో నిర్మిస్తున్న మినీ గోకులం షెడ్లను, జాడుపూడి, అంపురం పంచాయతీల్లో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను పరిశీలించారు. ఏపీవో జి.ధనుంజయ, సచివాలయ ఉద్యోగులు, ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

‘పేదల బతుకులతో ఆడుకుంటున్నారు’



సమావేశంలో సీఐటీయూ నాయకులు

టెక్కలి రూరల్: రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకునే వ్యాపారుల బతుకులతో అధికార పార్టీ నాయకులు ఆడుకుంటున్నారని సీఐటీయూ నాయకుడు నంబూరి షణ్ముఖరావు ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి చిరు వ్యాపారులపై కక్షసాధింపులు పెరిగాయన్నారు. వారికి సరైన ఉపాధి అవకాశాలు చూపించకుండా వారి జీవితాలతో ఆడుకోవడం తగదన్నారు. పలకల లక్ష్మీవారాలు, సంక్రాంతి ముందు ఉంటుండగా ఏదో కాస్తా వ్యాపారాలు జరుగుతాయనే ఆశతో ఉన్న సమయంలో ఎక్కడ లేనివిధంగా చిరువ్యాపారులపై ఇటువంటి కక్షసాధింపు చర్యలు తగవని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కొల్లి యల్లయ్య, ఉర్జాన మాధవరావు, ఆర్.వరదరాజులు, కె.ఉపేంద్ర, తిరుపతి పాల్గొన్నారు.



ఆకట్టుకున్న రంగ వల్లిక

లింగ వివక్షతకు వ్యతిరేకంగా టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన రంగ వల్లిక పోటీలు ఆకట్టుకున్నాయి. విద్యార్థినులు వేసిన ముగ్గులు ఆలోచింపజేశాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మతో పాటు మహిళా సాధికారత విభాగం సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

–టెక్కలి



గీతా జయంతి వేడుకలు..

కంచిలి మండల కేంద్రంలో గీతా జయంతి వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక శివాలయం వద్ద నుంచి పల్లకిలో శ్రీక్రిష్ణునితోపాటు నగర సంకీర్తన ర్యాలీని రాధాకృష్ణ ఆలయం వరకు చేపట్టారు. ముందుగా భగవద్గీత పుస్తకాలను స్థానిక హరేరామ హరేకృష్ణ భజన బృందం ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. శివాలయం వద్ద భగవద్గీత పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, వైఎస్సార్‌సీపీ నేత ఇప్పిలి క్రిష్ణారావు, రిటైర్డు ఎస్సై బి.రామక్రిష్ణ, జగదీష్ పట్నాయక్ ప్రారంభించారు.

–కంచిలి



ఆంజనేయ విగ్రహ ప్రతిష్ట

కవిటి మండలం మాణిక్యపురంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట బుధవారం వైభవంగా జరిగింది. ఒడిశాకు చెందిన వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ప్రతిష్ట ఉత్సవాల్లో శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

–కవిటి



చెరువు పరిశీలన

పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని కీర్తిరాయి చెరువును మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు స్థానిక నాయకులతో కలిసి బుధవారం పరిశీలించారు. చెరువును పార్కుగా తీర్చిదిద్దితే మంచిదని.. లేకుంటే స్థానికులు చెత్తను వేసి డంపింగ్ యార్డుగా మార్చేస్తారని స్థానికులు అన్నారు. పరిశీలనలో నాయకులు డాక్టర్ దుర్గారావు, అర్జి తులసీరావు, అర్జి నాగేశ్వరరావు, ధర్మారావు, సాయికుమార్ ఉన్నారు.

–కాశీబుగ్గ

మహాగ్రంథం భగవద్గీత



ఇచ్ఛాపురం: మాట్లాడుతున్న జోహార్‌ఖాన్

ఇచ్ఛాపురం: మానవ జీవన విధానాన్ని, జీవిత పాఠాన్ని నేర్పే కార్యనిర్వాహక మహాగ్రంథం భగవద్గీత అని స్థానిక జ్ఞానభారతీ సీబీఎస్ఈ పాఠశాల కార్యదర్శి సీఈఓ జోహార్‌ఖాన్ అన్నారు. గీతా జయంతి కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. ప్రపంచ దేశాలకు భగవద్గీత ఎలా మార్గదర్శకంగా నిలిచిందో విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వెంకటరమణ, ప్రిన్సిపాల్ ఐబీ పండా, హెచ్ఎం రషీదా సుల్తానా, ప్రమోద్, సయ్యద్ సుల్తానా, అలీమ్‌ఖాన్, సంగీతరాణి, శ్రీనివాసరావు, కైలాస్‌పండా పాల్గొన్నారు.

సోంపేట: మండలంలోని పలుగ్రామాల్లో భగవద్గీత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోంపేట రామకృష్ణాసేవా సమితి మందిరంలో, జింకిభద్ర మేదరస్వామి ఆశ్రమంలో, రుషికుద్ద, బెంకిలి, బారువ తదితర గ్రామాల్లో వేడుకలు జరిగాయి. గీతా పారాయణం, ప్రత్యేక పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. జింకిభద్రలో నిర్వహించిన గీతా జయంతి వేడుకల్లో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



సోంపేట: జింకిభద్ర గీతా జయంతి వేడుకల్లో ఎంపీపీ నిమ్మన దాస్ తదితరులు

కుదరని వేతన ఒప్పందం

- 26 తరువాత సమ్మెకు కార్మికుల పిలుపు



మాట్లాడుతున్న కార్మిక సంఘ అధ్యక్షులు క్రిష్ణమూర్తి

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ జంట పట్టణాలు, పరిసర ప్రాంతాలలో ఉన్న రైస్ మిల్లర్స్ అసోసియేషన్, రైస్ మిల్లర్స్, కాష్యూ లేబర్ యూనియన్‌ల మధ్య వేతన ఒప్పంద చర్చలు బుధవారం విఫలమయ్యాయి. చర్చలలో భాగంగా కార్మిక సంఘం అధ్యక్షులు అంబటి క్రిష్ణమూర్తి మాట్లాడుతూ.. కార్మికులకు ఇస్తున్న వేతనంపై 30 శాతం పెంచాలని డిమాండ్ చేశారు. అందుకు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డోకి రామారావు మాట్లాడుతూ.. కార్మికులకు ఇస్తున్న వేతనాలు ఏడు శాతం పెంచుతామని అంతకు మించి పెంచలేమని స్పష్టం చేశారు. కోపోద్రేకులైన రైస్ మిల్లర్స్ కార్మికులు మాట్లాడుతూ.. ఇప్పటికే మొదటిసారి సమావేశం వాయిదా పడిందని, ఇప్పుడు ఏడు శాతం ఇస్తామనం కార్మికులను అన్యాయం చేయడమేనన్నారు. ఈనెల 26వ తేదీ నాటికి 30 శాతం పెంచుతూ అంగీకారం తెలపాలని.. లేని పక్షంలో కార్మికులంతా అదే రోజు అర్ధరాత్రి నుంచి సమ్మెబాట పడతామని స్పష్టం చేశారు. సమ్మె సమాచారాన్ని పలాస ఏఎల్‌వో, టెక్కలి ఏసీఎల్, శ్రీకాకుళం డీసీఎల్, పలాస తహసీల్దార్‌కు అందిస్తామని అన్నారు. పరస్పర సభ్యులు వాదోపవాదాల మధ్య సమావేశం వాయిదాపడింది.

సంక్షిప్తంగా...

ఉత్సాహంగా టౌన్ క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, ఎమ్మెల్సీ రామారావు తదితరులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం, కవిటి మండలాల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో టౌన్ క్రిస్మస్ వేడుకలను బుధవారం సాయంత్రం పట్టణంలోని ఆస్పత్రి రోడ్డు ఆవరణలో డి.ఎన్.వి.ఎన్.కుమార్ అధ్యక్షతన టౌన్ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న జెడ్పీ చైర్మన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు మాట్లాడుతూ.. ప్రపంచానికి శాంతి, కరుణ, జాలి, దయ, సాహసం, ప్రేమలను పంచిన మహానుభావుడు ఏసుక్రీస్తు అని వర్ణించారు. ముఖ్యఉపన్యాసకులు కె.ఆర్.సింగ్ మాట్లాడుతూ.. ప్రభువు దృష్టిలో ప్రతీఒక్కరు సమానులే అన్నారు. కేక్ కట్‌చేసి ముందస్తుగా క్రిస్మస్ వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు, పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు ప్రభుదాస్, సుందర్‌రాజు, ఎం.డి.పాల్, విజయ్‌కుమార్, వజ్రపు వెంకటేష్, ప్రత్తి అన్వేష్, బిమ్మో బెహర, లీలారాణి పాల్గొన్నారు.

టాలెంట్ టెస్టు పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరణలో యూవీవీ ప్రతినిధులు

కాశీబుగ్గ: ఉద్దాన ప్రాంత విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న టాలెంట్ టెస్టు, విద్యాసదస్సు పోస్టర్ ఆవిష్కరణ బుధవారం జరిగింది. పలాస మండలం బొడ్డపాడు గ్రామంలో యూవీవీ ఉపాధ్యక్షురాలు పోతనపల్లి గీతమ్మ చేతులమీదుగా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 29వ తేన వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి జెడ్పీ ప్రభు త్వ ఉన్నత పాఠశాల ఆవరణలో టాలెంట్ టెస్టు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో అధ్యక్షులు బొమ్మాళి శివ, కార్యదర్శి గొరకల లోకేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు జినగ సీతారాం, కుత్తుం వినోద్‌కుమార్, బొడ్డు చిన్నారావు, కోరాడ లింగమూర్తి, కుత్తుం సుధాకర్, తెప్పల వాసు, బుడత డిల్లీరావు, పోతనపల్లి మాధవరావు ఉన్నారు.

వెలుగు ఏపీఎంకు సత్కారం

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలో వెలుగు ఏపీఎంగా విధులు నిర్వర్తిస్తున్న గొడబ ప్రసాదరావు చేసిన సేవలను గుర్తించి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ అధికారులు సత్కరించారు. జిల్లా కేంద్రంలోని బ్యాంకు రీజనల్ కార్యాలయంలో బుధవారం బ్యాంక్ మేనేజర్లు, సెర్ప్ ఏపీఎంలతో సమీక్ష సమావేశం జరిగింది. మహిళా సంఘాల సభ్యులకు రుణాలు అందించడంతో పాటు లావాదేవీలు సంక్రమంగా జరిగేందుకు కృషి చేసిన ప్రసదరావు సేవలను గుర్తించిన బ్యాంక్ అధికారులు జ్ఞాపికతో సత్కరించారు.

మూలపేటలో పారిశుద్ధ్య పనులు

సంతబొమ్మాళి: మండలంలోని మూలపేట గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు బుధవారం నిర్వహించారు. కాలువల్లో పూడికతీత చేపట్టి బ్లీచింగ్ చల్లారు. పరిసరాల పరిశుభ్రతకు తమవంతుగా సహకరించాలని సచివాలయ సిబ్బంది కోరారు. పంచాయతీ కార్యదర్శి అనిల్ ప్రభాస్ ఉన్నారు.

ఘనంగా అయ్యప్ప ఇరుముడి పూజలు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని కాశీబుగ్గ అయ్యప్పస్వామి సన్నిధానంలో మాలధారణ చేసిన స్వాములు ఇరుముడి పూజలను బుధవారం ఘనంగా నిర్వహించారు. 40 రోజులు దీక్షచేపట్టిన వారంతా గురుస్వామి బాబూరావు పండా ఆధ్వర్యంలో ఇరుముడు పూజలు అనంతరం శబరిమలైకు బయలుదేరి వెళ్లారు. పలాస, కాశీబుగ్గ, కవిటి అగ్రహారం ప్రాంతాలకు చెందిన అయ్యప్పస్వాములు ఉన్నారు.



సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
టెక్కలి / పలాస / ఇచ్ఛాపురం
9010178979
Office mail : sklmadvt@gmail.com